# మంత్ర పుష్పం

"ఈ సిఫారసు సహాయపడుతుందని గట్టి నమ్మకమేం లేదు. ఆ ఆఫీసరూ నేను చిన్ననాటి స్నేహితులమే. నా మాటకి విలువ ఇవ్వాలని ఎంత అనుకున్నా, ఎన్నో ఒత్తిడులు ఉంటాయి కదా! అదృష్టం బాగుంటే నీకీ వుద్యోగం రావచ్చు. ప్రయత్నించి చూడు."

సిఫారసు ఉత్తరం రాయటం ముగించి, కవర్లో పెట్టి సుబ్బారావుకి అందించాను. అతను అదే అపాయింట్ మెంట్ ఆర్డర్ అయినట్టు, దానిని ఆప్యాయంగా తీసుకుని జేబులో భద్రపరిచాడు. అతని వదనం కళ కళ లాడింది. "ఈ ఉద్యోగం వస్తే మా కష్టాలు గట్టెక్కుతాయండీ. మీ మేలు జీవితంలో మర్చిపోను" అన్నాడు కృతజ్ఞతతో.

"దాందేముందిలే, నీకు ఉద్యోగం దొరికితే అంతకంటే ఏం కావాలి. విష్ యు గుడ్ లక్."

"థాంక్స్. వస్తానండీ....నమస్కారం" సుబ్బారావు సెలవు తీసుకున్నాడు. పాపం అతను సంవత్సరం కిందట బి.ఏ. పాసయాడు. మూడు పార్ట్లలోనూ సెకండ్ క్లాస్ తెచ్చుకున్నాడు కూడా. అప్పటినుంచీ ఉద్యోగం కోసం ఎక్కే గడపా, దిగే గడపా. పై చదువులకి పోతే తప్పక రాణించగలడు. కాని ఆర్థికస్తోమత లేదు. చిన్నప్పుడే తండ్రి పోయాడు. ఎలాగో కష్టపడి సంసారాన్ని నెట్టుకొస్తూ తల్లి అతన్ని బి.ఎ. వరకూ చదివించింది. అతనే పెద్దవాడు. గంప సంసారాన్ని అతనే ఈది మిగతావాళ్ళని గట్టెక్కించాలి. పొరుగే కావటంవల్ల ఆ చిదికిన సంసారం ఎలాంటి కష్టాల్లో ఉన్నదీ కళ్లారా చూస్తూనే వున్నాను. అడపాదడపా నేనూ ఏదో కాస్త సహాయం చేస్తున్నా, అది సముద్రంలో నీటి చుక్కే. ఈ ఉద్యోగం దొరికితే ఆ సంసారం కొంత కుదుట పడుతుంది.

"నమస్కారం సార్."

ఆలోచనలకి అంతరాయం కలిగి తలెత్తి చూశాను.

"నేను సీతారామయ్యగారి అబ్బాయినండీ. మా నాన్నకి అకస్మాత్తుగా గుండె పోటు వచ్చిందండీ. హాస్పిటల్లో చేర్పించాము. మందులకీ వాటికీ కొంత డబ్బు

అర్జంట్‌గా కావాలండీ. చేతిలో యేమీలేదు. దయచేసి ఒక పాతికరూపాయలు అప్పిస్తే వచ్చే నెలలో తప్పక తీర్చుకుంటాము." దైన్యం ఉట్టిపడేట్టు అన్నాడతను. అతని కనుకొలకుల్లో కన్నీరు నిండింది. మనిషి కొద్దిగా వొణుకుతున్నాడు.

"సీతారామయ్య గారంటే....?"

"రిటైర్డ్ ఎలిమెంటరీ స్కూల్ టీచరండీ."

"ఆఁ....ఆఁ....మా పేటలో స్కూల్లో చాలా కాలం పనిచేశారు కదూ?''

"అవునండీ. మీ అబ్బాయికి ప్రైవేట్ ట్యూషన్‌కూడా చెప్పారు కొంతకాలం."

"ఊఁ....ఊఁ....ఇప్పుడెక్కడ వుంటున్నారు మీరు?"

"పాత ఇంట్లోనేనండీ. ప్రొద్దున భోజనానికి కూర్చున్నారు. ఇంతలోనే 'అబ్బా' అని స్పృహ తప్పి పడిపోయారండి."

"అరెరె. డాక్టరుగారు ఏమన్నారు?"

"ఎటాక్ సివియర్‌గా వచ్చింది. అప్పుడే ఏమీ చెప్పలేం అన్నారండీ" అన్నాడతను గాద్గదికంగా.

అతనలా గాలిలో ఆకులా వొణికిపోతుంటే హృదయం ఆర్ద్రమైంది. బయటికి వెళ్ళినప్పుడు సీతారామయ్య తటస్థపడి మాటామంతీలో, తన సంసారం ఎలా చిల్లులు పడ్డ గొడుగైందో వెళ్ళబోసుకునే దృశ్యం మనసులో మెదిలింది. పాపం చావు బతుకుల్లో వున్నాడు. వెంటనే ఆ కుర్రవాడు అడిగిన డబ్బు ఇవ్వాలనిపించింది. కాని నాలో ఆర్థిక వ్యక్తి వెనక్కి లాగుతున్నాడు. ఆ గుంజాటనలో ఒక అయిదు రూపాయలు తక్కువకి రాజీపడి, ఇరవై రూపాయిలు మాత్రం అతని చేతిలో పెట్టాను. ఆ కరెన్సీ కాగితాల్ని అతను యించుమించు లాక్కున్నంత పని చేశాడు. తన ప్రవర్తనకి అతనే లజ్జపడినట్టున్నాడు. ముఖం ఎరుపెక్కింది. తనమీద తనకే అసహ్యం వేసినట్టు ముఖం పెట్టాడు.

"చాలా థాంక్సండీ. సాధ్యమైనంత త్వరలో మీ అప్పు తీర్చుకుంటాను."

'పరవా లేదులే. తీరిగ్గా ఇవ్వొచ్చు. భగవంతుడి దయవల్ల మీ నాన్నకి త్వరలో ఆరోగ్యం చేకూరుతుంది. భయపడకు" ఓదార్పుగా అన్నాను.

"వస్తానండీ" అని అతను వెళ్ళబోయాడు.

"నీ పేరేమిటన్నావు?"

"కృష్ణమూర్తండీ."

అతను గబ గబ వెళ్ళిపోయాడు. సీతారామయ్య పరిస్థితి గురించి ఆలోచిస్తూ నేనూ అలాగే కూర్చుండిపోయాను.

"పోస్ట్ సార్."

పేపర్ తర్వాత ఆతృతలో ఎదురు చూసే వాటిలో పోస్ట్ ముఖ్యమైంది' అయితే ఆ రోజు పోస్టు నిరాశాజనకంగా వుంది. ఒక్కటే ఉత్తరం వచ్చింది. అందులో మంచి సంగతులేమీ లేవు. మా మేనత్త కొడుక్కి అకస్మాత్తుగా రక్తం వాంతి అయితే, అతన్ని ఆస్పత్రిలో చేర్చారుట. వెంటనే బయలుదేరి సరాసరి గవర్నమెంటు ఆస్పత్రికి రమ్మని వ్రాశారు. తప్పేదేముంది. హడావిడిగా బయలు దేరాను. ఒకవిధంగా యీ ప్రయాణం మంచిదేననిపించింది. వీలుగావుంటే సుబ్బా రావు ఉద్యోగం విషయం గురించి కనుక్కోవచ్చు. తెనాలి నుంచి గుంటూరు గంట ప్రయాణం. అయినా బద్ధకించి సిఫారసు వుత్తరంతో అతన్ని ఆఫీసర్ దగ్గరకే పంపాను. నేనే స్వయంగా వెడితే బాగుండేది. ఇప్పుడు తప్పనిసరిగా ప్రయాణం చెయ్యవలసి వస్తోంది. మరి ఇందులో సొంత విషయం వుంది కదా.

ఆస్పత్రికి వెళ్ళేసరికి రోగి పరిస్థితి ఆందోళనగా ఉంది. వెంటనే ఆపరేషన్ చేయాలన్నారు. కడుపులో అల్సర్ వుందట. ఇంక డాక్టర్లు, నర్సుల చుట్టూ తిరగడమే సరిపోయింది. దైవానుగ్రహం వల్ల ఆపరేషన్ విజయవంతమైంది. కాని రోగిని జాగ్రత్తగా కనిపెట్టి వుండాలన్నారు. ఆ రాత్రంతా జాగారం చేశాను! మర్నాడు రోగి కోలుకున్నాడు. ప్రాణం కుదుటబడ్డది. డాక్టర్ వచ్చి చూసి ఆస్పత్రిలో లేని మందులు కొన్ని రాసి, వెంటనే తెప్పించమన్నాడు. త్వరగా మందులు తెచ్చి ఇచ్చి సుబ్బారావు వుద్యోగం విషయం కనుక్కోవాలి. వెంటనే బయలుదేరాను. ఆస్పత్రి దగ్గర వున్న షాపుల్లో ఆ మందులు లేవు. పెద్ద బజారులోకాని దొరకవన్నారు. రిక్షా మాట్లాడుకుని ఎక్కబోయేంతలో "నమస్కారం సార్" అన్నారెవరో. వెను దిరిగి చూశాను. కృష్ణమూర్తి, సీతారామయ్యగారి అబ్బాయి.

"ఏమోయ్ ఇక్కడున్నావేం ? మీ నాన్నగారికెలా వుంది ?" అతను నేల చూపులు చూస్తూ "గుంటూరు తీసికెళ్ళమన్నారు సార్, ఇక్కడ ఆస్పత్రిలో చేర్పిం చాను. ఒక్క ఇరవై రూపాయలు తక్కువైనాయండి. పొద్దుటినుంచీ ప్రయత్నిస్తు న్నాను. ఎక్కడా దొరకలేదు. దయచేసి మీరే కాపాడాలి. దైవంలా కనిపించారు" అన్నాడు దీనంగా.

అతను కష్టాల్లో ఉండి అడుగుతున్నా నాకు కొంచెం చిరాకు తోచింది. ఎక్కడో ప్రయత్నించాలిగాని కనబడ్డదే తడవు నా దగ్గరేదో కుప్పపోసుకున్నట్లు అడిగితే ఎలా! నాకు యివ్వబుద్ధి పుట్టలేదు. "ఎక్కడైనా చూడవోయ్! నా దగ్గర సర్దుబాటు కాదు" అన్నాను నిష్కర్షగా. అతను చప్పున "అలాగే సార్. మీరేమనుకోకండి. అవసరం కొద్దీ అడిగాను. ఎక్కడైనా దొరుకుతుందేమో చూస్తా" అన్నాడు. నాకు కొంచెం చిన్నతనం వేసింది.

"సహాయం చెయ్యలేకపోయినందుకు విచారిస్తున్నాను" అన్నాను.

"అదేమిటి సార్. మీరు సమయానికి ఆదుకున్నారు. లేకపోతే యీ మాత్రం ఆశకూడా దక్కేదికాదు. మీరెక్కడికో తొందరగా వెడుతున్నట్లున్నారు అడ్డువచ్చాను. క్షమించండి" అన్నాడతను. "అంత తొందరేంలేదు. ఇక్కడ మా బంధువు ఒకాయన్ని ఆస్పత్రిలో చేర్చారు, ఏదో మందులకోసం వెడుతున్నా" అని రిక్షా ఎక్కబోయాను. "మందులకోసం మీరు వెళ్ళట మెందుకుసార్. నేను ఎలాగో వెడుతున్నాను కదా. ఆ చీటి ఇవ్వండి. నేను తెచ్చిపెడతా" అని అతను నా జవాబుకి ఎదురుచూడకుండానే నా చేతిలోని చీటి లాక్కున్నాడు. "డాక్టరుగారు ఈ మందుల ఖర్చు సుమారు పదిరూపాయలుంటుందన్నారు. ఇదిగో ఈ పదిహేను ఉంచు. స్పెషల్‌వార్డులో ఇరవైరెండో నంబరు గదిలో ఉంటాను.

అతనికి పదిహేను రూపాయలిచ్చి ఆస్పత్రిలోకి నడిచాను. చప్పున నాకో ధర్మసందేహం కలిగింది. అతను ఇరవై రూపాయలు తక్కువైనాయన్నాడు. దేనికి తక్కువ? మందుల ఖర్చుకే అయిఉంటుంది. ఈ పదిహేను కలిపి తనకి కావలసిన మందులు కొని ఉడాయించడు కదా! కాని వెంటనే నాకు అనుమాన నివృత్తి అయింది. సీతారామయ్య కూడా ఆ ఆస్పత్రిలోనే కదా చేరింది. డబ్బు కాజేసి కృష్ణమూర్తి మళ్ళీ ఆస్పత్రిలోకి ఎలా అడుగు పెడతాడు. అన్నట్లు సీతారామయ్య బెడ్ నెంబర్ అడగలేదు. అయినా పరవాలేదు. హార్టు పేషంట్స్ వార్డులో కనుక్కోవచ్చు. ఇలా ప్రశ్నలు, సమాధానాలతో చికాకు పడిన మనస్సుతో ఇరవైరెండో నెంబర్ రూమ్‌కి చేరి కృష్ణమూర్తి కోసం నిరీక్షిస్తూ కూర్చున్నాను. పాపం, ఒక అరగంటలో కృష్ణమూర్తి రానేవచ్చాడు. అతన్ని చూడగానే, కాసేపటికింద వరకూ అతన్ని గురించి చెడుగా ఆలోచించినందుకు పశ్చాత్తాప పడ్డాను. గబగబ నడిచి వచ్చినట్లున్నాడు. ఆయాసపడుతున్నాడు.

"సార్ ఈ మందులు పందొమ్మిది రూపాయల డెబ్బయి పైసలు అవుతాయట. ఇదిగో చీటివెనక ఖరీదులు రాశాడు మెడికల్ షాప్ సేల్స్‌మన్. మిగతా మొత్తం యిస్తే మందులు తెచ్చిపెడతాను."

"తక్కువ డబ్బిచ్చి అతన్ని రెండుసార్లు తిప్పుతున్నందుకు సిగ్గుపడి, ఇంకో అయిదు రూపాయలిచ్చి, "నీకు శ్రమ ఇస్తున్నాను" అన్నాను.

"అబ్బే, ఇందులో శ్రమేం ఉందండీ."

"అన్నట్టు మీ నాన్నగారి బెడ్ నెంబర్ ఎంత? ఒకసారి చూసి వస్తా" అన్నాను.

అతను ఒకక్షణం తటపటాయించి, "డాక్టర్ నాన్నను ఎవరూ చూడకూడదన్నారండీ" అన్నాడు.

"అలాగా, సరేలే, అసలు బెడ్ నెంబర్ ఎంత ?"

"పదహారు."

అంటూనే కృష్ణమూర్తి చప్పున వెళ్ళిపోయాడు. అరగంట గడిచింది. గంట గడిచింది. అతను రాలేదు. సుబ్బారావు ఇంటర్వ్యూ పదకొండింటికి. ఈ లోపల ఆఫీసర్‌ని కలుసుకోవాలి. కృష్ణమూర్తి ఇంకా రాలేదు. ఒకవేళ వాళ్ళ నాన్న దగ్గరికి వెళ్ళాడేమో. వెంటనే హార్టు పేషంట్స్ వార్డులోకి వెళ్ళి పదహారో నెంబర్ బెడ్ చూశాను.

గుండె గతుక్కుమంది. అది ఖాళీగా ఉంది. కొంపదీసి ప్రమాదమేం జరగలేదు కద! ఆ పక్కన ఉన్నవారిని అడిగాను. వాళ్ళ సమాధానం ఆశ్చర్యం కలిగించింది. ఆ బెడ్ రెండు రోజుల్నించీ ఖాళీగానే ఉందట. ఏమిటో చిత్రం కృష్ణమూర్తి అన్నీ అబద్ధాలు చెప్పాడా, ఎంత దీనంగా, ఎంత నమ్మకంగా మాట్లాడాడు! ఇదంతా నా దగ్గర డబ్బు కొట్టెయ్యడానికా! ఎంత మోసం! చేసేది లేక మళ్ళీ ఇరవై రెండో నెంబర్ గది చేరాను. ఇంకో గంట కూడా గడిచింది. కృష్ణమూర్తి జాడలేదు. ఇంక నిరాశపడి డాక్టర్ని అడిగి మళ్ళీ చీటీ తీసుకుని బజారుకు వెళ్ళి మందులు తెచ్చి ఇచ్చాను. ఇంక నాకు ఎక్కడికీ వెళ్ల బుద్ధిపుట్టలేదు. రోగి కోలుకోవటంవల్ల ఇంక ఆస్పత్రిలో ఉండనవసరం లేదు. బంధువుల దగ్గర సెలవు తీసుకుని మధ్యాహ్నం బస్సులో తిరిగి వచ్చాను. కృష్ణమూర్తి ఉదంతం మనస్సులో ముల్లు గుచ్చుకున్నట్టు బాధపెట్ట సాగింది. అసలు విషయం తెల్సుకోవాలని సరాసరి సీతారామయ్య గారింటికి

వెళ్ళాను. ఆయన వరండాలో శుభ్రంగా ఉంఛ్రాయి ముక్కలా కూర్చొని ఉన్నాడు. ఈయనకా గుండెపోటు !

సీతారామయ్యగారు నన్ను చూడగానే లేచి నిలబడి "రండి, రండి" అన్నాడు. లోపల్నించి పాతకుర్చీ ఒకటి తెచ్చివేసి "కూర్చోండి, క్షేమమా ?" అన్నాడు. కుర్చీలో కూర్చొని తల ఆడించి ఆయన వైపు పరీక్షగా, దీక్షగా చూశాను.

"ఏమిటి సార్ అలా చూస్తున్నారు ?" అన్నాడాయన.

"ఏం లేదు. మీ వంట్లో కులాసాయే గదా !" అన్నాను.

"ఆ, కులాసాయేనండీ. ఏం, అలా అడుగుతున్నారు ?"

"మీ అబ్బాయి కృష్ణమూర్తి మీకు హార్ట్ ఎటాక్ వస్తే గుంటూరు ఆస్పత్రిలో చేర్పించానని చెప్పాడే !"

సీతారామయ్య ముఖ కవళికలు మారాయి.

ఆయన నుదురు కొట్టుకొని "నా ఖర్మ" అన్నాడు.

"గుంటూరు ఆస్పత్రిలో పదహారో నెంబర్ బెడ్ మీ కిచ్చారన్నాడు. చూస్తే అది ఖాళీగా ఉంది. రెండు రోజుల్నించీ ఖాళీగానే ఉందిట."

కోపంతో అయన ముఖం జేవురించింది.

"అప్రాచ్యుడు మీ దగ్గర డబ్బేమైనా తీసుకున్నాడా !"

"మొదట ఇరవై తీసుకున్నాడు. తర్వాత గుంటూర్లో నాకు మందులు తెచ్చి పెడతానని ఇరవై తీసుకుని పరారయ్యాడు. ఏమిటిలా తయారుచేసారు !"

సీతారామయ్య నిలువునా కంపించాడు. పళ్ళు కొరికాడు.

"ఛ. ఇంత అప్రతిష్ఠ పనులు చేస్తాడని కలలో కూడా అనుకోలేదు. మొన్న మొన్నటిదాకా ఎంతో అణకువతో, భయభక్తులతో ఉండేవాడండీ, ఏ దయ్యం పట్టిందో ఏమో, నాలుగైదు రోజుల్నించీ ఇలాటి పాడుపనులు చేస్తున్నాడు. మీరే కాదు, ఇంకా అయిదారుగురు ఇలా నా దగ్గరికి వచ్చి నేను నిక్షేపంగా ఉండటం చూసి ఆశ్చర్యపడి వాడి సంగతి చెప్పారు. బాబూ, నా సంగతి మీకు తెలియంది కాదు. ఎప్పుడైనా ఇలాంటి దిక్కుమాలిన పని చేసానా ? వాడు చేస్తే మాత్రం ఊరుకుంటానా ! ఇంటికి రానీండి. చెమడాలు ఎక్క దీస్తాను. ఎంత దరిద్రపు రోజులండీ. ఏ దుష్ట సావాసాలు చేసాడో, ఏ దౌర్భాగ్యపు అలవాట్లకి బానిస అయాడో! ఇలా ఎంతమంది

దగ్గర నాకు గుండెపోటని చెప్పి అడుక్కున్నాడో ! ఎంత దుర్గతికి దిగజారాడండీ. బాబుగారూ, ఇవి చేతులు కావు. కాళ్ళు, క్షమించండి. కొంచెం గడువియ్యండి. మీ బాకీ ఎలాగో చెల్లించుకుంటాను. మీరేమి అనుకోకండి. తిండికి పేదయినా ఇంతవరకూ నేను గుణానికి పేదను కాలేదండీ, నా కడుపున చెడబుట్టాడండీ."

సీతారామయ్య అలా ఆక్రోశిస్తూంటే నాకు జాలివేసింది. అలాంటి ఉత్తముణ్ణి బాధ పెట్టినందుకు కృష్ణమూర్తిమీద మరింత కోపం ప్రజ్వరిల్లింది.

"ఊరుకోండి సీతారామయ్యగారూ, డబ్బుదేముంది. కుర్రవాడు ఇలా పాడై పోతున్నాడని విచారం. అంతే" అన్నాను.

"నెమ్మదిగా అంటారేం బాబూ, కడుపుకోతండీ. వాడి మీద గంపెడంత ఆశ పెట్టుకున్నానండీ. పింఛను పుచ్చుకున్న నావల్ల ఇంకేమవుతుంది. వాడే సంసారాన్ని గట్టెక్కిస్తాడని ఆశ పెట్టుకుంటే ఇలా చేస్తున్నాడండీ.

ఆయన అలా వాపోతుంటే నిజంగానే గుండెపోటు వస్తుందేమోననిపించింది.

"ఊరుకోండి, ఏదన్నా వుద్యోగంలో ప్రవేశపెట్టండి త్వరగా. అతనే బాగు పడతాడు" అని ఊరడించాను.

ఉద్యోగాలు ఊరికే వున్నాయా బాబూ. బి.ఏ. పాసయి ఊరికే వున్నాడు. వాడి లోపం లేకుండా అప్లికేషన్లు పెడుతూనే వున్నాడు. కాని ఎవరిస్తారు బాబూ. ఆ మధ్య ఎక్కడో ఖాళీ ఉందంటే వాళ్ళచేత, వాళ్ళచేత చెప్పించాను. చివరికి డబ్బిస్తేనే ఉద్యోగం అని పై అధికారి నీళ్లు కార్చాడు బాబూ. ఏం చేసేది ?"

ఆయన అలా మాట్లాడుతూండగానే కృష్ణమూర్తి హడావిడిగా"నాన్నా నాన్నా" అంటూ వచ్చి నన్ను చూసి నోట మాటరాక నిశ్చేష్టుడయాడు. అతన్ని చూడగానే సీతారామయ్య ఆగ్రహావేశపరవశుడయాడు. "ఛీ — నాన్న ఈ నాన్న ఎప్పుడు గుండెపోటుతో చస్తాడా అని చూసే అప్రాచ్యుడికి నాన్నెందుకురా ? ఎక్కడెక్కడో అడుక్కొచ్చుకొని ఈ పాడు జీవితం గడపటం కంటే ఎందులోనైనా పడిచావరాదట్రా ఛీ, నువ్వు నాకు కొడుకువు కావు....అబ్బా."

సీతారామయ్యగారు అరుస్తున్నవాడల్లా ఒక్కసారి కేకపెట్టి కుప్పలా కూలి పోయాడు.

"మీ నాన్నకి నిజంగానే హార్ట్ ఎటాక్ వచ్చింది" అన్నాను.

కాని ఆ స్థితిలో అలా క్రూరంగా అన్నందుకు వెంటనే పశ్చాత్తాప పడ్డాను. ఆయన్ని వెంటనే ఆస్పత్రికి చేర్చాము. శ్రద్ధగా చూడవలసిందని డాక్టర్ని ప్రార్థించి, కృష్ణమూర్తి చేతిలో ఇరవై రూపాయలు పెట్టాను. అతను తెల్లబోతూ దీనంగా చూశాడు. అంతరంగంలో నేను నాకు తెలియకుండానే క్రూరంగా ప్రవర్తిస్తున్నాననిపించింది. అతని భుజం తట్టి, ''వస్తానని'' అక్కడినించి వచ్చేసాను.

ఇంట్లోకి అడుగు పెట్టంగానే సుబ్బారావు గుమ్మంలో దిగులుతో ప్రత్యక్షమయినాడు.

''ఏమయిందోయ్,'' అన్నాను. అతను నిట్టూర్పు విడిచి ''పోయిందండీ, ఉద్యోగం దొరకలేదు.''

ఇక్కడ రిటైర్డ్ ఎలిమెంటరీ స్కూల్ టీచర్ సీతారామయ్యగారు లేరూ. ఆయన కొడుకు ఆ ఉద్యోగాన్ని కొనుక్కున్నాడు. అతనే యీ విషయం నాకు చెప్పాడు. ఈ రోజుల్లో కావలసింది సిఫారసు కాదు సార్...." అతనేదో చెబుతున్నాడు. కాని ఇంక నాకేమీ వినిపించటం లేదు. చేతిలో ఇరవై రూపాయలతో కృష్ణమూర్తి నావైపు దీనంగా చూస్తున్న దృశ్యమే కనిపించసాగింది.

[జ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక 1972]